
పాఠం 12

# హైదరాబాదు రాష్ట్రంలో స్వాతంత్ర్యోద్యమం

దక్షిణ భారతదేశంలో బ్రిటిషు అధీనంలోని అతి ముఖ్యమైన రాజ్యాలలో హైదరాబాదు ఒకటి. దానిని నిజాంలు పరిపాలించే వాళ్లు. బ్రిటిషు వైస్రాయ్‌కి లోబడి ఉంటూ బ్రిటిషు విధానాలను పాటించేవాళ్లు. ఇటువంటి రాజ్యాలలో వైస్రాయ్ 'రెసిడెంట్ల'ను నియమించేవాడు. ఈ రాజ్యాలు అవలంబిస్తున్న విధానాలపై నిఘా ఉంచుతూ, పరిపాలనలో అప్పుడప్పుడూ ఈ రెసిడెంటు జోక్యం చేసుకునేవాడు.

బ్రిటిషు–నిజాం పాలనలో ప్రజల పరిస్థితి ఎలా ఉండిందో, స్వాతంత్ర్యం కోసం ప్రజలు ఎలా పోరాడారో ఈ అధ్యాయంలో తెలుసుకుందాం. హైదరాబాదు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు మరాఠి, కన్నడం, తెలుగు, డెక్కనీ ఉర్దూ మాట్లాడే వాళ్లు. ఈ పాఠంలో ప్రధానంగా తెలుగు, ఉర్దూ మాట్లాడిన తెలంగాణ జిల్లాలను గురించి తెలుసుకుందాం.




*పటం 1 : 1901 హైదరాబాదు రాష్ట్రంలో నిజాం దివానీ అధికారం ఉన్న, లేని ప్రాంతాలు*





స్వామి రామానంద తీర్థ



ముల్లా అబ్దుల్ ఖయ్యూం



మాడపాటి హనుమంతరావు



రావి నారాయణరెడ్డి

## జాతీయవాద తొలి సంవత్సరాలు

1888 అక్టోబరులో హైదరాబాదులో ప్రముఖ వ్యక్తులతో కూడుకున్న ఒక చిన్న బృందం భారత జాతీయ కాంగ్రెసు గురించి తెలియ చేయటానికి ఒక సమావేశం నిర్వహిస్తూ దానికి సంబంధించి కరపత్రాలు పంచింది, ప్లకార్డులు ప్రదర్శించింది. విద్యావంతులలో చాలామంది కాంగ్రెసు పట్ల ఆకర్షితులయ్యారు. హైదరాబాదుకు చెందిన ముల్లా అబ్దుల్ ఖయ్యూం కాంగ్రెసుకు ప్రధాన మద్దతుదారుడయ్యాడు. అతడు కాంగ్రెసు సమావేశాలకు హాజరవుతూ వాటిల్లో చురుకుగా పాల్గొనమని ముస్లింలను ప్రోత్సహిస్తూ ఉండేవాడు. రాచరికపు కుటుంబాలను విమర్శిస్తూ, నిజాం ప్రభుత్వంలో వాళ్లకు ఇచ్చిన ప్రత్యేక సదుపాయాలను వ్యతిరేకించేవాడు. ప్రజల సామాజిక, మేధో, ఆర్థిక జీవనాలను మెరుగుపరిచే ఉద్దేశంతో అతడు అంజుమన్–ఎ–మారెఫ్ అన్న సంస్థను స్థాపించాడు. జాతీయవాద ప్రభావాన్ని సూచిస్తూ రాష్ట్రం నుంచి అనేక దినపత్రికలు వెలువడేవి. హైదరాబాదు *టెలిగ్రాఫు*, *డెక్కన్ స్టాండర్డ్*, ముస్లిం–ఇ–సఫిక్ వంటి దినపత్రికలు జాతీయతావాదాన్ని ప్రచారం చేశాయి. వాటిల్లో అనేకం జాతీయతా వాదానికి మద్దతునిచ్చాయి.

చాదర్‌ఘాట్ మెథడిస్ట్ ఎపిస్కోపల్ చర్చికి చెందిన రెవరెండ్ గిల్డర్ వంటి క్రైస్తవ మత ప్రబోధకులు కాంగ్రెసుకు మద్దతు ఇచ్చారు. ఆ విధంగా హైదరాబాదులో కాంగ్రెసు ఆదరణ పొందింది. స్వాతంత్ర్యం, అభివృద్ధి, ప్రాతినిధ్య సంస్థలతో ప్రభుత్వ రూపాలు వంటి విషయాలలో ప్రజలకు చైతన్యం కలిగించటంలో కాంగ్రెసు కూడా పాత్ర పోషించింది.

1892 సంవత్సరంలో హైదరాబాదులో ఆర్య సమాజం ఏర్పడింది. నిర్మాణాత్మక పనులలో కార్యకర్తలకు శిక్షణ ఇవ్వటానికీ, ప్రజల అభిప్రాయ సమీకరణకు, సామాజిక–మత సంబంధ చైతన్యానికి ఆర్య సమాజం దోహదం చేసింది. హైదరాబాదులో జాతీయ ఉద్యమానికి అనేక నాయకులను అందించింది.

## రాష్ట్రంలో ఫ్యూడల్ వ్యవస్థ

నిజాంలు మొదట్లో మొఘల్ చక్రవర్తుల కింద ప్రాంతీయ గవర్నర్లుగా ఉండేవాళ్లు. వంశ పార్యంపర్యంగా కొనసాగే జాగీర్‌దారులు, చిన్న చిన్న రాజుల సహాయంతో వాళ్లు పాలనను సాగించారు. డజన్లు, ఒక్కొక్కసారి వందల గ్రామాలు జాగీర్‌దారుల నియంత్రణలో ఉండేవి. వాటిని వాళ్లు తమ ఇష్టం వచ్చినట్లు పాలించేవాళ్లు, ప్రజలపై పన్నుల భారం మోపేవాళ్లు. రాజ్యంలో మిగిలిన ప్రాంతాన్ని దొరల సహాయంతో నిజాంలు నేరుగా పాలించేవాళ్లు. ఈ దొరల గురించి ఇంతకు ముందు అధ్యాయంలో మీరు చదివారు.

రాజులు, వాళ్ల వంశస్థులు అన్ని వనరులను నియంత్రిస్తూ, వాళ్ల చిత్తం వచ్చినట్లు పాలించే పాత వ్యవస్థనే కొనసాగింప చేయాలని నిజాంకి ఉండేది. స్థానిక సంస్థలు, శాసనసభలు వంటి ప్రజాస్వామిక వ్యవస్థలను వాళ్లు అనుమతించలేదు. కాంగ్రెసు నేతృత్వంలోని జాతీయ ఉద్యమాన్ని నిజాంలు వ్యతిరేకించారు, రాష్ట్రంలో రాజకీయ కార్యకలాపాలను నిషేధిస్తూ అనేక ఫర్మానాలు జారీచేశారు. పోలీసు నిఘా వ్యవస్థలను ఏర్పరచి ప్రజలను నిరంతరం దగ్గరగా పరిశీలించేవారు.



## భాష, మతం

హైదరాబాదు రాష్ట్రాన్ని నిజాం వంశస్థులు పాలించారు. వాళ్లు ముస్లింలు, డెక్కనీ ఉర్దూ మాట్లాడేవాళ్లు. అయితే రాజ్యంలోని అధిక శాతం ప్రజలు హిందువులు. వీళ్లు తెలుగు, కన్నడ, మరాఠి మాట్లాడేవాళ్లు. అధికారిక భాషగా ఉర్దూ ఉండేది. ఉన్నతాధికారులలో 90 శాతానికి పైగా ముస్లింలు ఉండేవాళ్లు. ప్రాథమిక స్థాయినుండి విశ్వవిద్యాలయం వరకు బోధనా మాధ్యమంగా ఉర్దూ ఉండేది. సాంకేతిక పాఠ్యపుస్తకాలు సైతం ఉర్దూలోకి అనువాదమయ్యి అందుబాటులో ఉండేవి.

తమ రాజ్యంలో పాఠశాలలు నెలకొల్పడంలో నిజాం పాలకులు చాలా వెనకబడ్డారు. చాలామంది జాగీర్‌దారులు తమ ప్రాంతంలో పాఠశాలలు ఏర్పాటు చేయటాన్ని వ్యతిరేకించారు. నైజాం వ్యతిరేక భావనలకు ప్రైవేటు పాఠశాలలు కేంద్రాలు అవుతాయన్న అనుమానం నిజాంలకు ఉండేది. తెలుగు మాధ్యమంగా ప్రైవేటు పాఠశాలలు స్థాపించటాన్ని వాళ్లు వ్యతిరేకించారు. ఆ విద్యార్థులకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రవేశం నిరాకరించారు. ఫలితంగా 1941 నాటికి కూడా రాష్ట్రంలో విద్యావంతులు 9.3 శాతమే ఉన్నారు (మహిళలలో 4.3 శాతం మాత్రమే విద్యావంతులు). ఇందుకు విరుద్ధంగా ట్రావన్‌కోర్ రాజ్యంలో 47.7 శాతం అక్షరాస్యత, బరోడాలో 23 శాతం, మైసూరు రాజ్యంలో 12.2 శాతం అక్షరాస్యత ఉండేది.

- హైదరాబాదు రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకూ, బ్రిటిషు పాలనలో ఉంటున్న ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకూ మధ్య ఏమైనా తేడాలు ఉన్నాయా?
- ప్రజాస్వామ్యం పట్ల బ్రిటిషు పాలకులు, నిజాంలకు మధ్య ఏమైనా భిన్న అభిప్రాయాలు ఉన్నాయా?

## ఆంధ్ర జన సంఘం

20వ శతాబ్దంలో ఆంధ్ర ప్రాంతంలో తెలుగులో పెద్ద సంఖ్యలో పుస్తకాలు ముద్రితమయ్యాయి, పట్టణాలు, గ్రామాలలో గ్రంథాలయాలు నెలకొల్పబడ్డాయి. 1901లో హైదరాబాదులో కొమర్రాజు లక్ష్మణరావు, నాయని వెంకట రంగారావు, రావిచెట్టు రంగారావు శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం స్థాపించారు. ఇది ఈనాటికీ పని చేస్తోంది. అయితే, హైదరాబాదు రాష్ట్రంలో తెలుగు వివక్షతకు గురయ్యేది. 1921లో హైదరాబాదులోని వివేకవర్ధిని కళాశాలలో ఇంగ్లీషు, లేదా ఉర్దూలో కాకుండా ఒక వ్యక్తి తెలుగులో తీర్మానాన్ని ప్రవేశ పెట్టినందుకు అవమానింపబడ్డాడు. ఈ ఘటన వల్ల తెలుగు మాట్లాడే ప్రజలు చాలా బాధపడ్డారు. తెలుగుకి సరైన స్థానం, గౌరవం దొరికేలా పోరాడటానికి సిద్ధమయ్యారు.



*చిత్రం 12.1 : నిజాం కళాశాల*



1924లో మాడపాటి హనుమంతరావు మరికొంత మందితో కలిసి ఆంధ్ర జన సంఘాన్ని ఏర్పాటు చేశాడు. గ్రంథాలయాలు, పఠనగదులూ ఏర్పాటు చేయటం, విద్యార్థులను, పండితులను ప్రోత్సహించటం, తెలుగు రాతప్రతులను సేకరించటం, తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహించటం దీని ఉద్దేశాలు. వీళ్లు చిన్న చిన్న పుస్తకాలను ముద్రించి, గ్రంథాలయాలను నెలకొల్పటానికి గ్రామాలలో సమావేశాలను నిర్వహించేవారు. చిన్న చిన్న వ్యాపారస్తులు, రైతులు, కూలీలు, ఇతర ప్రజలు ఎదుర్కొనే సమస్యల గురించి ఈ పుస్తకాలు ఉండేవి. జన సంఘం ద్వారా 4000 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ప్రభుత్వ వ్యతిరేకత కారణంగా వీటిల్లో చాలావరకు మూసివేయాల్సి వచ్చింది. అయినప్పటికీ, మహిళలు, విద్యార్థులు, గాయకులు వంటి అనేక మంది ప్రజలు పెద్ద సంఖ్యలో ఉద్యమంలో చేరటంతో అది విస్తరించింది.

- మీ ప్రాంతంలో ఏఏ భాషలు మాట్లాడతారు?
- మన రాష్ట్రంలో ఏఏ భాషల ద్వారా విద్యాబోధన జరుగుతోంది?
- బోధన అంతా ఒకరి మాతృ భాషలోనే ఉండాలన్నది మీ అభిప్రాయమా?
- మాతృభాషలలో పుస్తకాలు ముద్రించటం ఎందుకు ముఖ్యం?

## ఆంధ్ర మహాసభ, గ్రంథాలయ ఉద్యమం

వివిధ వర్గాల నాయకులు ఒక పెద్ద సంఘంగా ఏర్పడాలని అనుకోవటంతో 1930లో ఆంధ్ర మహాసభ (ఎ.ఎం.ఎస్.) ఏర్పడింది. దాని వ్యవస్థాపకులలో మాడపాటి హనుమంతరావు, రావి నారాయణ రెడ్డి వంటి వాళ్లు ఉన్నారు. దాని తొలి ఉద్దేశం విద్యా సౌకర్యాలను మరింతగా పెంచటం. పాఠశాలలు ఏర్పాటు చేయమని, ప్రజల సమస్యలు పరిష్కరించమని కోరుతూ వాళ్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు, విజ్ఞాపనలు అందించారు. 1935లో జరిగిన



*చిత్రం 12.2 : ఆదిలాబాద్ జిల్లా కేసలాపూర్‌లో జరిగిన నిజాం కోర్టు సమావేశంలో హాజరైన ప్రజలతో బ్రిటిష్ అధికారులు*




© SCERT not to be republished

వార్షిక సమావేశంలో ప్రభుత్వాన్ని ఈ దిగువ కోర్కెలు కోరారు:

1. నిర్బంధ ప్రాథమిక విద్యను అమలు చేయాలి.
2. మాతృభాష (తెలుగు)లో విద్యా బోధన జరగాలి.
3. జాగీర్ ప్రాంతాలలో ప్రజల చట్టబద్ధ హక్కులకు రక్షణ కల్పించాలి.
4. బాల్య వివాహాలను నిరోధించాలి.
5. స్థానిక ప్రజా ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలి.
6. అంటరానితనాన్ని నిషేధించాలి, అంటరాని వాళ్లకు సమాజంలో గౌరవనీయ స్థానం కల్పించాలి.

ఆంధ్ర మహాసభ ఉద్దేశాలలో విద్యాపర, సామాజిక సంస్కరణలు రెండూ కలిసి ఉండటం మీరు గమనించి ఉంటారు. ఎఎంఎస్ కార్యకలాపాలు వేగంగా తెలంగాణ అంతటా వ్యాపించాయి. మారుమూల గ్రామాల్లో సైతం గ్రంథాలయాలు, సాంస్కృతిక కేంద్రాలు ఏర్పాటు అయ్యాయి. రైతులు, కార్మికులు ఈ కేంద్రాలకు చదువు నేర్చుకోవటానికీ, దినపత్రిక చదువుతుంటే వినటానికీ, దేశ పరిస్థితుల గురించి, నిజాం ప్రభుత్వంతో, దొరలతో తమ సమస్యల గురించి చర్చించటానికీ వచ్చేవాళ్లు. ఈ కేంద్రాలలో రాత్రి పాఠశాలలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించే వాళ్లు. వీరేశలింగం వంటి సామాజిక సంస్కర్తలు, గాంధీజీ, నెహ్రూ వంటి జాతీయ నాయకులు రాసిన పుస్తకాలను ప్రజలు చదివేవాళ్లు. అంతేకాదు స్థానిక సమస్యలపై కొత్త పుస్తకాలు కూడా రాసేవాళ్లు. గోల్కొండ పత్రిక సంపాదకుడిగా సురవరం ప్రతాపరెడ్డి ప్రజలలో జాతీయతా భావాలను రగిల్చాడు. హైదరాబాదు రాష్ట్ర స్వాతంత్ర్యానికి పోరాడిన వాళ్లల్లో కాళోజీ నారాయణరావు, దాశరథి కృష్ణమాచార్య, దాశరథి రంగాచార్య వంటి సాహితీ దిగ్గజాలు ఉన్నారు.

ఉద్యమంలో ప్రజలు అధిక సంఖ్యలో చేరుతూ విద్యతోపాటు ఎఎంఎస్ తమ సమస్యలను పరిష్కరిస్తుందని ఆశించారు. నూతన, విప్లవాత్మక ఆలోచనలకు ఈ కేంద్రాలు పునాదిగా మారటంతో నిజాం ప్రభుత్వం వీటిని వేధింపులకు గురి చేయసాగింది. 1940 నాటికి చాలా మంది కమ్యూనిస్టులు ఎఎంఎస్‌లో చేరారు. వెట్టిని అంతం చేయటం, భూ సంస్కరణలు, దొరల దోపిడీ వంటి ప్రజల సమస్యలను చేపట్టాలని వాళ్లు పట్టు పట్టారు. ఎఎంఎస్ లోని పాత తరం నాయకులు దీనితో విభేదించారు, విద్యా, సాహితీ వేదికగానే ఎఎంఎస్ కొనసాగాలని భావించారు. అయితే అనతి కాలంలోనే విప్లవ వర్గాలు నాయకత్వంలోకి వచ్చి రైతాంగ ఉద్యమాన్ని మొదలుపెట్టాయి.

- మీ ఊళ్లో లేదా మీ ప్రాంతంలో ప్రభుత్వ గ్రంథాలయం ఉందా?
- మీరు ప్రభుత్వ గ్రంథాలయానికి వెళ్లి ఉంటే అక్కడ ఏం జరుగుతుందో మీ స్నేహితులకు వివరించండి.
- గ్రంథాలయాలు నిజాం వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక కేంద్రాలుగా ఎందుకు మారాయి?
- తెలుగు మాధ్యమంలో పాఠశాలలను నిజాంలు, జాగీర్‌దారులు ఎందుకు అనుమతించలేదు?

## హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు

బ్రిటిషుపాలనలో ఉన్న ప్రాంతాలలోనే భారత జాతీయ కాంగ్రెసు పని చేసేది, వివిధ రాజ్యాలలో అది నేరుగా పనిచేసేది కాదు. అయితే ఈ రాజ్యాలలోని ప్రజలు మరింత అణచివేతకు, అన్యాయాలకు గురయ్యేవాళ్లు, భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగం కావాలని వాళ్లు తహతహలాడేవాళ్లు. ఇటువంటి రాజ్యాలలో జాతీయవాదులు 'రాష్ట్ర కాంగ్రెస్'లు ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రజాస్వామిక హక్కులు, సంస్కరణలు, ప్రాతినిధ్య ప్రభుత్వం వంటి వాటికోసం





పోరాడసాగారు. హైదరాబాదులో కూడా ఇదే జరిగింది.

హైదరాబాదులో జాతీయతావాదానికి పెరుగుతున్న ఆదరణను చూసిన నిజాం 1938లో ప్రతి ఒక్కరి నోటిపై పలుకుతున్న జాతీయతా గీతమైన 'వందేమాతరం'ని నిషేధించాడు. దీంతో పెద్ద ఉద్యమం చెలరేగింది. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ గీతాన్ని ఆలపిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమంలో పాల్గొన్నారు. నిజాం ప్రభుత్వం కళాశాలలను మూసివేయగా విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్ళి చదువులు కొనసాగించారు.

రాష్ట్రంలో యువత స్పందనను చూసి కాంగ్రెసు ఉద్యమం పట్ల సానుభూతి ఉన్న హైదరాబాదు జాతీయతావాదులు స్ఫూర్తి పొంది 1938లో హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసును ఏర్పాటు చేశారు. దాని ముఖ్య నాయకులలో స్వామి రామానంద తీర్థ ఒకరు. అతడు కాక బి. రామకిషన్ రావు, జమలాపురం కేశవరావు, కె వి రంగారెడ్డి, జె. వి నరసింగరావు వంటి యువ నాయకులు ఉద్యమంలో ముందు భాగాన ప్రముఖంగా నిలిచారు. యువ కాంగ్రెసు నాయకులైన డా॥ మర్రి చెన్నారెడ్డి ఆ తరవాత రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు, శ్రీ పి.వి. నరసింహారావు దేశానికి ప్రధానమంత్రి అయ్యారు. ప్రజలకు ప్రాథమిక హక్కులు కల్పించాలని రాష్ట్ర కాంగ్రెసు కోరింది. వాక్, సంఘ, పత్రిక, మతపర ఊరేగింపుల స్వాతంత్ర్యాన్ని హరిస్తూ జారీ చేసిన ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరింది. నిజాం కాకుండా ప్రజలతో ఎన్నుకోబడిన ప్రతినిధులు రాష్ట్రానికి సంబంధించిన చట్టాలు చేయాలని కూడా కాంగ్రెసు కోరింది.

దేశంలో క్విట్ ఇండియా ఉద్యమం చేపట్టినప్పుడు 1942లో రాష్ట్ర కాంగ్రెసు దానికి అనుగుణంగా సత్యాగ్రహం చేపట్టింది. రాష్ట్ర కాంగ్రెసును నిజాం ప్రభుత్వం నిషేధించి, నాయకులను జైలుపాలు చేసింది. 1946లో భారతదేశం స్వాతంత్ర్యం పొందబోతోందని నిర్ధారణ కావటంతో నిజాం పాలనకు అంతం పలికి హైదరాబాదు రాష్ట్రాన్ని భారత గణతంత్రంలో విలీనం చేయాలని హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు ఉద్యమం చేపట్టింది.

- వందేమాతరం గీతం గురించి మరింత తెలుసుకోండి.
- స్వామి రామానంద తీర్థ జీవితం గురించి మరిన్ని వివరాలు తెలుసుకోండి.

## తెలంగాణ సాయుధ పోరాటం (1946-51)

హైదరాబాదు రాష్ట్రంలోని జాగీర్‌దారులు, దొరల గురించి పదవ అధ్యాయంలో చదివారు. తెలంగాణ ప్రాంతంలో రైతాంగం, వృత్తి కులాలవాళ్లు ఎదుర్కొన్న సమస్యలను గుర్తుకు తెచ్చుకోండి.

1929 నుంచి పటేల్, పట్వారీలు, దేశ్‌ముఖ్‌లు, రెవెన్యూ, పోలీసు అధికారుల దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడటానికి నల్గొండ, పిల్లలమర్రి, కరీంనగర్ వంటి ప్రాంతాలలో రైతు సంఘాలు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతాలలో ఎఎంఎస్ క్రియాశీలంగా ఉండి గ్రంథాలయాలు, రాత్రి పాఠశాలలు స్థాపించింది. ఎఎంఎస్, కిసాన్ సభలలో పని చేస్తున్న కమ్యూనిస్టులు 1946లో అంతిమంగా వాటిని చేజిక్కించుకున్నారు. వెట్టికి వ్యతిరేకంగా, **'దున్నేవానికి భూమి'** అంటూ విప్లవాత్మక కార్యక్రమాలను చేపట్టారు. ఆ తరవాత నల్గొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఎఎంఎస్ అంతటా విస్తరించింది. ఎఎంఎస్ గ్రామస్థాయి శాఖలను ఏర్పాటు చేసింది. ఇవి 'సంఘం'గా పేరు పొందాయి. ఈ సంఘాలకు కమ్యూనిస్టు పార్టీ కూడా నాయకత్వం ఇచ్చింది. మొదట్లో చట్టవిరుద్ధ ఫ్యూడల్ దోపిడీ, లెవీ విధానాలను, అధిక భూ శిస్తులను, కౌలుదారులను తొలగించటాన్ని వ్యతిరేకిస్తూ, వెట్టిని నిర్మూలించాలని కోరుతూ రైతాంగం ఉద్యమించింది. గ్రామీణ సమాజంలోని అన్ని వర్గాలను (చిన్నకమతాలు ఉన్న రైతులు, భూస్వాములు, వృత్తికులాలు) నిజాంకి, దొరలకి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో భాగస్వాములుగా చేయటానికి ప్రయత్నించారు.



© SCERT not to be republished

ఆ రోజుల్లో భూస్వాములు చిన్నరైతులను తొలగించి వాళ్ల భూములను చేజిక్కించుకుని అధిక కౌళ్లకు కొత్త వాళ్లకు ఇచ్చేవాళ్లు. దీనిని వ్యతిరేకిస్తూ


ఐలమ్మ

సంఘాలు ఉద్యమం చేశాయి. విస్నూరు రామచంద్రారెడ్డి అనే జమీందారు చాకలి ఐలమ్మ భూములను బలవంతంగా లాక్కోటానికి ప్రయత్నించాడు. దీనిని సంఘం సమర్థంగా తిప్పికొట్టింది. దీనికి ప్రతీకారంగా జులై 1946లో కడివెండి అనే గ్రామంలో రైతుల ప్రదర్శనపై జమీందారు కాల్పులు జరపగా దొడ్డి కొమరయ్య అమరుడయ్యాడు. ఈ ఘటనతో ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ సాయుధ పోరాటం రాజుకుంది. ఊరు తరవాత ఊరులో సంఘాలు ఏర్పడ్డాయి, దొడ్డి కొమరయ్యను కొనియాడుతూ పాటలు పాడుతూ ప్రజలు ఊరేగింపులు నిర్వహించారు. ఉద్యమాన్ని హింసాత్మకంగా అణచివేయడానికి నిజాం, దొరలు ప్రయత్నించారు. దీంతో సంఘం సాయుధ దళాలను నిర్మించసాగింది. జమీందార్లను పల్లెలనుంచి తరిమికొట్టి గ్రామ పంచాయితీ ద్వారా ప్రజల పాలనను నెలకొల్పారు.

గ్రామాల రక్షణకు గెరిల్లా దళాలు, ప్రజల సమస్యలు పరిష్కరించటానికి గ్రామరాజ్య సంఘాలు ఏర్పాటు చేశారు. పోరాట సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లటానికి బుర్ర కథ దళాలు ఏర్పడ్డాయి. ఈ బృందాలు ఊరూరు తిరిగి ప్రజల్లో చైతన్యాన్ని నింపాయి.

సమాంతర ప్రభుత్వాలను, ప్రజాకోర్టులను ఏర్పాటు చేయటానికి సంఘాలు కృషి చేశాయి. సంఘం అధీనంలోకి వచ్చిన గ్రామాలలో వెట్టిని నిర్మూలించారు, కౌలుదారుల తొలగింపును నిలిపివేశారు, కౌళ్లను తగ్గించివేశారు, కూలీల వేతనాలను పెంచారు, భూస్వాముల అదనపు భూమిని స్వాధీనం చేసుకుని భూమిలేని వాళ్లకు దానిని పంచి పెట్టారు.

1947-48 నాటికి ఈ ఉద్యమం నిజాం వ్యతిరేక, ఫ్యూడలిజం వ్యతిరేక విస్తృత రూపాన్ని సంతరించుకుని హైదరాబాదుని స్వతంత్ర భారతదేశంలో ఐక్యం చేయాలని కోరసాగింది. గ్రామ అధికారుల, వడ్డీ వ్యాపారస్తుల దస్తావేజులను ప్రజలు తగలబెట్టారు, భూస్వాములు, వ్యాపారస్తుల నిల్వచేసిన ధాన్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఉద్యమ పరిధిని పెంచి, అన్ని వర్గాలను అందులో కలుపుకోటానికి తెలంగాణ ప్రాంతాన్ని తెలుగు మాట్లాడే ఇతర ప్రాంతాలతో కలిపి 'విశాలాంధ్ర'ను ఏర్పాటు చేయాలని పోరాడసాగారు.

నైజాం పాలనను, హైదరాబాదు రాష్ట్రంలో ముస్లింల ఆధిపత్యాన్ని కాపాడటానికి మతతత్వ ముస్లింలు ఇత్తెహదుల్ ముస్లిమీన్ అనే సంస్థను ఏర్పాటు చేశారు. రజాకార్ల పేరుతో స్వచ్ఛంద కార్యకర్తల దళాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థ ఏర్పాటు చేయటానికి కృషి చేస్తున్న ముస్లిం మేధావులపై వీళ్లు మొదట దాడులు చేయటం మొదలుపెట్టారు. వాళ్లు ఆయుధాలను సమకూర్చుకుని ప్రజాస్వామిక రాజకీయ పార్టీలపై దాడులు చేయసాగారు, మత కల్లోలాలను సృష్టించసాగారు. రైతు సంఘాలపైనా, కమ్యూనిస్టు దళాలపైనా దాడులకు దిగారు. దీంతో వీళ్లకి దొరల, భూస్వాముల మద్దతు లభించింది. కమ్యూనిస్టుల నేతృత్వంలోని రైతాంగానికీ, దొరల మద్దతు ఉన్న రజాకార్లకీ మధ్య తీవ్ర పోరాటాలు జరిగాయి. భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరవాత హైదరాబాద్‌ను భారత యూనియన్‌లో విలీనం చేయడం కోసం ఉద్యమించిన రాజకీయ సంస్థలపై రజాకార్లు దాడులు చేయడం ప్రారంభించారు. వారు గ్రామాలపై పడి క్రూరమైన దాడులు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. దాని ద్వారా హైదరాబాద్ స్వతంత్రంగా ఉంటుందని భావించారు. వీరు అనేక గ్రామాలను తగులబెట్టి స్త్రీలను చెరబట్టి సాధారణ ప్రజల్లో మానసిక ఆందోళనను, భయాన్ని కలిగించారు. వరంగల్ కోటలో జరిగిన ఒక సంఘటనలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న బత్తిని





మొగిలయ్యను రజాకార్ల గుంపు పాశవికంగా చంపేసింది. జనగామ తాలూకాలోని బైరాన్‌పల్లి గ్రామంలో మతోన్మాదులైన రజాకార్లు విజృంభించి అనేక మందిని కాల్చిచంపారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పటికీ నిజాం జోక్యం చేసుకోకుండా ప్రేక్షక పాత్ర వహించసాగాడు. 1948లో స్వతంత్ర భారతదేశం చర్య తీసుకుని హైదరాబాదుని తనలో విలీనం చేసుకుంది. విలీనం తరవాత కూడా భూసంస్కరణలు అమలు చేయటానికీ, దొరల నుంచి రైతాంగ రక్షణకూ తెలంగాణ సాయుధ పోరాటం కొనసాగింది. అయితే భారత సైనిక దళాలు ఈ ఉద్యమాన్ని అణచి వేయటంతో 1950 నాటికి ఇది ఆగిపోయింది.

- తెలంగాణ సాయుధ పోరాటం రూపుదిద్దుకోవటంలో ఎఎంఎస్ ఎటువంటి పాత్ర పోషించింది?
- రైతాంగ సమస్యలు పరిష్కరించటం ఒక్కటే తెలంగాణ సాయుధ పోరాట ఉద్దేశమా, ఇంకేమైనా ఉన్నాయా?
- హిందువులైన దొరలు రజాకార్లకు ఎందుకు సహాయం చేశారు?

## భారతదేశంలో విలీనం

1947లో భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు అప్పటి నిజాం అయిన ఉస్మాన్ ఆలీఖాన్ హైదరాబాదును స్వతంత్ర రాజ్యంగా ఉంచాలని అనుకున్నాడు. రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేయాలని సామాన్య ప్రజలు కోరుకున్నారు. దీని కోసం రామానంద తీర్థ నాయకత్వంలో హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు పెద్ద ఎత్తున ఉద్యమించింది. రజాకార్లు వాళ్లపై కూడా దాడులు చేశారు. ఈ అరాచకత్వానికి అంతం పలకాలని నిర్ణయించిన భారత ప్రభుత్వం సైనిక దళాలను హైదరాబాదు మీద పంపించింది. 1948 సెప్టెంబరులో అంతిమంగా హైదరాబాదు భారత దేశంలో విలీనం అయ్యింది. ప్రజాస్వామ్య ప్రక్రియ పూర్తయ్యే వరకు నిజాంను పరిపాలకునిగా కొనసాగమని భారత ప్రభుత్వం ఆదేశించింది. ఫ్యూడల్ వ్యవస్థను రద్దుచేసి నిజాం రాజ్యంలో ప్రజాస్వామ్య ప్రక్రియలైన ఎన్నికలను మొదలుపెట్టక తప్పలేదు. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి రావటంతో నైజాం పాలన అంతమయ్యింది. కానీ ఆఖరి నిజాం అయిన ఉస్మాన్ ఆలీఖాన్ హైదరాబాదు 'రాజ్ ప్రముఖ్' (రాష్ట్ర అధిపతి) గా కొనసాగారు. అయితే అతడు భారత ప్రభుత్వ అధికారుల సలహా మేరకు నడుచుకోవాలి. 1952లో ఎన్నికలు జరిగి హైదరాబాదులో ప్రజలతో ఎన్నుకోబడిన ప్రభుత్వం ఏర్పడింది. హైదరాబాదుకి బూర్గుల రామకృష్ణారావు మొదటి ముఖ్యమంత్రి అయ్యారు. 1956 వరకు రాజప్రముఖ్‌గా నిజాం కొనసాగాడు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు కలిసి ఆంధ్రప్రదేశ్ ఏర్పడటంతో రాజ్ ప్రముఖ్ స్థానంలో భారతదేశ అధ్యక్షుడు నియమించిన గవర్నరు బాధ్యతలు చేపట్టాడు. ఆ విధంగా హైదరాబాదు రాష్ట్రంపై నైజాముల పాలన ముగిసింది.


*చిత్రం 12.3 : 1948 సెప్టెంబరు 17న పటేల్‌తో ఉస్మాన్ ఆలీఖాన్*

- భారతదేశంలో హైదరాబాదు విలీనం అయిన తరవాత కూడా నిజాంను అధికారంలో ఎందుకు కొనసాగనిచ్చారు?
- ఫ్యూడల్ వ్యవస్థను రద్దుచేస్తూ ఫర్మానాలు జారీ చేయటానికి నిజాం ఎందుకు అంగీకరించాడు?
- 1950 జనవరి 26న నైజాం పాలన అంతం అయ్యిందని ఎందుకు చెప్పవచ్చు?

### తెలంగాణ పోరాటంలో మహిళలు

నిజాంలు, దొరల పాలనలో మహిళలు ఎక్కువగా బాధలకు గురయ్యారు. వాళ్లు నిత్యం వేధింపబడ్డారు. భూస్వాములకు పని చేయటమే కాకుండా సందర్శించే అధికారులకు సేవలు చేయాల్సి వచ్చేది. చాలామంది మహిళలు భూస్వాములకు దాసీలుగా నియమించబడేవారు. ఇటువంటి మహిళలు ఆంధ్ర మహాసభ నిర్వహించిన రాత్రి పాఠశాలలకు హాజరయ్యి సంఘాలలో, కమ్యూనిస్టు పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. కొంతమంది మహిళలు ఆయుధాలు పట్టి రజాకార్లతో పోరాడారు, కొంతమంది పాటలు పాడి ప్రజలను ఉత్తేజపరిచారు, మరికొంతమంది డాక్టర్లు, నర్సులుగా పనిచేశారు. ఉద్యమం కోసం వారు ఎన్నో త్యాగాలను చేశారు. సాయుధ పోరాటంలో పాల్గొన్న ఒక మహిళ అనుభవాన్ని ఆమె మాటల్లోనే తెలుసుకుందాం:



*చిత్రం 12.4 : మహిళా గెరిల్లా దళం*

*"నా పేరు కమలమ్మ. మాది మానుకోట తాలూకాలోని గ్రామం. మాది కట్టు బానిస కుటుంబం... మా అమ్మ భూస్వామి ఇంటిలో దాసి... నాకు పదిహేను సంవత్సరాల వయసప్పుడు మా నాన్న చనిపోయాడు. ఆ సమయంలోనే తెలంగాణ పోరాటం మొదలయ్యింది. మా చెల్లెలును దొరసాని తన కూతురితోపాటు దాసిగా పంపించాలని అనుకుంది... నా భర్తను దొరసాని కొట్టేది. కట్టుబానిస బతుకు చాలా దుర్భరంగా ఉండేది: పశువులను మేపాలి, పేడ ఎత్తాలి, అన్ని పనులూ చేయాలి. నా భర్తను గూండాగా కూడా ఉపయోగించుకున్నారు. భూస్వాముల ఇళ్లల్లోని దారుణాలు భరించలేక పోరాటంలోకి వెళ్లాం...*

*ముందుగా మా అన్న దళనాయకుడయ్యాడు... నా భర్త, నేను కమ్యూనిస్టు పార్టీలో చేరాం... నా పని సాంస్కృతిక దళంలో. నేను పాటలు పాడుతూ ఒక ఊరునుంచి మరొక ఊరుకి ప్రయాణం చేసేదానిని... అడవిలో పని చేస్తూ కోయ మహిళలకు సహాయం చేశాం... వైద్య కేంద్రంలో ఉంటూ నేను ప్రథమ చికిత్స, ఇంజిక్షన్లు చేయటం నేర్చుకున్నాను... ఆ సమయంలో అడవిలో ఉండగా నా మొదటి కొడుకు పుట్టాడు... అప్పుడు కామ్రేడ్లు 'పిల్లవాడు ఏడిస్తే మనమంతా పట్టుబడతాం. కాబట్టి పిల్లవాడిని ఎవరికైనా ఇచ్చివేయి, లేదా ఎక్కడైనా వదలివేయి...' అని చెప్పారు. అయితే పిల్లవాడిని తీసుకోటానికి ఎవరూ సిద్ధపడలేదు. రెండురోజులపాటు నడిచి అతడిని ఒక గని కార్మికుడి వద్ద విడిచి వచ్చాను... ఆ తరవాత నా శరీరం, నా మనసూ నా అధీనంలో లేవు. కంటినుంచి కన్నీళ్లు వరదలై పారాయి..."*



### కీలక పదాలు

| | | |
|---|---|---|
| 1. ఫర్మానాలు | 2. వెట్టి | 3. ఫ్యూడల్ వ్యవస్థ |
| 4. సామంతరాజులు | 5. చట్టబద్ధ హక్కులు | 6. గెరిల్లా దళం |
| 7. జాగీర్‌దారులు | 8. ప్రాతినిధ్య ప్రభుత్వం | |

### మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. నిజాం పాలనలో ఏ అంశాలను 'అప్రజాస్వామికంగా' భావిస్తారు?
2. ఇతర రాజ్యాలతో పోలిస్తే హైదరాబాదు రాష్ట్రంలో అక్షరాస్యత తక్కువగా ఎందుకు ఉంది?
3. విద్యావ్యాప్తికి ఆంధ్ర మహాసభ చేపట్టిన కార్యక్రమాలను వివరించండి.
4. హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు కోరికలు ఏమిటి? 1948 తరవాత వాటిలో ఎన్ని నెరవేరాయి?
5. నిజాం పాలన అంతం కావటానికి తెలంగాణ సాయుధ పోరాటం దోహద పడిందా? మీ కారణాలను పేర్కొనండి.
6. 'రాష్ట్రంలో ఫ్యూడల్ వ్యవస్థ' పేరా చదివి కింది ప్రశ్నకు సమాధానం రాయండి.
   నిజాం రాజ్యంలో ఉన్న ఫ్యూడల్ వ్యవస్థను మీరు సమర్థిస్తారా? సమర్థించరా? అయితే ఎందుకు?
7. గతంలో పాలకులకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు జరిగాయా? ఈ మధ్యకాలంలో అటువంటి ఉద్యమాలు తలెత్తాయా? జరిగి ఉంటే అవి ఏమిటి?



© SCERT not to be republished